
సాక్షి విజయనగరం

బుధవారం । 29 । మార్చి । 2023



పాడి రైతుకు వరం.. సంచార వాహనం

పాడిరైతులకు సహాయకారిగా మెలుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం వారికి మరింత మేలుచేసే నిర్ణయాలు తీసుకుంటోంది. - 8లో



వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

విజయనగరం జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పలువురు వ్యక్తులు గాయపడ్డారు. - 8లో



హత్య పథకం బట్టబయలు

పాతకక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిని హతమార్చేందుకు ప్రత్యర్థులు పన్నిన కుట్రను పోలీసులు బట్టబయలు చేశారు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ (సా॥)	గురు (ఉ॥)
6:15	4:32

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రికి స్వాగతం



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: విశాఖపట్నంలో జరిగే జీ–20 సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి విజయనగరం జిల్లా జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు మంగళవారం ఘన స్వాగతం పలికారు. ఎయిర్ పోర్ట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

చీఫ్‌కోచ్‌పై సస్పెన్షన్ వేటు

- ఇన్‌చార్జి బాధ్యతలు సత్యగోపాల్‌కు అప్పగింత

విజయనగరం: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్, స్విమ్మింగ్‌కోచ్ పి.అప్పలనాయుడును సస్పెండ్ చేస్తూ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ మంగళవారం ఆదేశాలు జారీచేసింది. స్విమ్మింగ్ పూల్ నిర్వహణ లోపాలపై సరైన సమాధానం ఇవ్వకపోవడం, అధికారులను తప్పుదోవ పట్టించే సమాచారం ఇచ్చినందుకు చర్యలు తీసుకున్నారు. మూడురోజుల్లో స్విమ్మింగ్ పూల్‌లో వాటర్ నింపమని చెప్పిన ఆదేశాలను పాటించకుండా నిర్లక్ష్యం వహించడంపై చర్యలు తీసుకున్నట్టు శాప్ అధికారులు పేర్కొన్నారు. ఆయన స్థానంలో ఇటీవల ఉద్యోగంలో చేరిన టెన్నిస్ కోచ్ సత్యగోపాల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, దూసి శివప్రసాద్, రాజేష్‌లు శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉపాధి కోర్సుల్లో మహిళలకు ఉచిత శిక్షణ

- వచ్చేనెల 8వ తేదీలోగా దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్: వివిధ ఉపాధిహామీ కోర్సుల్లో మహిళలకు స్థానిక మహిళా ప్రాంగణంలో ఉచిత శిక్షణ ఇస్తామని స్టేట్‌బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ జి.బి.వి.రమణ తెలిపారు. మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ అండ్ ఫ్యాబ్రిక్ పెయింటింగ్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణపొందేవారికి ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తెలుపుకార్డు కలిగి, పదోతరగతి పాస్/ఫెయిలైన 45 ఏళ్లలోపు గ్రామీణ ప్రాంత మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు వచ్చేనెల 8వ తేదీలోగా దరఖాస్తులను కార్యాలయానికి పంపాలని కోరారు. పూర్తివివరాల కోసం సెల్: 99595 21662, 99857 87820 నంబర్లను సంప్రదించాలన్నారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి..!

వరుడు : శ్రీరామచంద్రుడు
వధువు : సీతాదేవి
వేదిక : సీతారామస్వామివారి కల్యాణ మండపం, రామతీర్థం
సమయం : 30వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి 12.30 వరకు
సుముహూర్తం : 12 గంటలకు అభిజిత్ లగ్నం
అభ్యర్థన : వేదపండితుల వేదమంత్రోచ్ఛారణ నడుమ జరిగే సీతారామచంద్రమూర్తి కల్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించి సీతాసమేత రామస్వామివారి అనుగ్రహాన్ని పొందుతారని మనవి.



సీతారాముల ఉత్సవ విగ్రహాలు



రామతీర్థం దేవస్థానం

- ప్రభుత్వ లాంఛనాలతో శ్రీరామనవమి వేడుకలు
- రామతీర్థం తరలిరానున్న ప్రముఖులు
- తలంబ్రాల పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు
- తిరుపతి నుంచి చేరుకున్న పట్టువస్త్రాలు
- ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పించనున్న బొత్స దంపతులు

నెల్లిమర్ల రూరల్:

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థానికి శ్రీరామనవమి శోభ సంతరించుకుంది. రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో గురువారం జరగనున్న సీతారాముల కల్యాణ వేడుకను కనులారా వీక్షించేందుకు భక్తజనం వేయి కళ్లతో ఎదురు చూస్తోంది. రామస్వామి వారి దేవస్థానం సమీపంలోని స్వామివారి కల్యాణ మండపంలో గురువారం ఉదయం 10.30 నుంచి 12.30 వరకు సీతారామస్వామివారి పరిణయ ఘట్టం జరగనుంది. ప్రత్యేక పూజలనంతరం మధ్యాహ్నం 12గంటలకు అభిజిత్ లగ్నంలో స్వామి కల్యాణాన్ని అర్చకులు జరిపించనున్నారు. కల్యాణం నిర్వహించే వేదికను సుందరంగా అలంకరిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, ముత్యాల తలంబ్రాల పంపిణీకు ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు చేశారు. వారం రోజుల నుంచి ఆలయానికి కల్యాణశోభ సంతరించుకుంది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన సుమారు 25 మంది రుత్వికులు నిర్విరామంగా పారాయణాలు జరుపుతున్నారు. శ్రీరామనవమి సందర్భంగా స్వామికి లక్షతులసీ దళార్చన, కుంకుమార్చన పూజలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో జరిగే సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్నిఏర్పాట్లను దాదాపు పూర్తి చేశారు. టెంట్ల ఏర్పాటుతో పాటు దర్శనం కోసం భక్తులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక క్యూలు సిద్ధం చేశారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

పార్కింగ్: ఆలయ ప్రాంగాణం వద్ద, కల్యాణ వేదిక ప్రారంభం వద్ద
ముత్యాల తలంబ్రాల కౌంటర్: స్వామివారి కల్యాణ వేదిక వద్ద ఎడమ భాగాన..
ప్రాథమిక చికిత్సా కేంద్రం: కల్యాణ వేదిక ప్రాంగణం
ప్రసాదాల కౌంటర్: తూర్పు రాజగోపురం వద్ద..

స్వామివారి దర్శనం ఇలా...

తూర్పుగోపురం ద్వారా రూ.50 టికెట్లు తీసుకునే భక్తులను ప్రత్యేక దర్శనానికి అనుమతిస్తారు. ఉచిత దర్శనం దక్షిణ గోపురం ద్వారా అనుమతిస్తారు. సీతారామచంద్రస్వామి వారి కల్యాణం తిలకించేందుకు వచ్చే భక్తుల కోసం అధికారులు వివిధ రకాల సదుపాయాలు కల్పించారు.

ప్రత్యేక ఏర్పాట్లు..



కల్యాణ వేదిక ప్రాంగాణం చుట్టూ షామియానాల ఏర్పాటు

ఎండ తీవ్రత దృష్ట్యా కల్యాణ ప్రాంగణంలో స్వామివారి కల్యాణాన్ని భక్తులు తిలకించేందుకు టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు కూర్చునే వద్ద చల్లగా ఉండేందుకు ఎలక్ట్రానిక్ పరికరాలను అమర్చుతున్నారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు, చిన్న పిల్లలకు పాలు అందించనున్నారు. సతివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్యశిబిరాన్ని నిర్వహిస్తారు.

ఇలా చేరుకోవాలి....

విజయనగరం ఆర్టీసీ బస్ స్టాండ్ నుంచి సుమారు 20 కిలోమీటర్ల ప్రయాణం చేసి రామతీర్థం చేరుకోవచ్చు. ఆటోల్లో వచ్చే వారు మూడు లాంతర్ల కూడలి నుంచి నెల్లిమర్ల రామతీర్థం జంక్షన్‌కు చేరుకొని అక్కడ నుంచి 5 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి ఉంటుంది. రణస్థలం నుంచి 20 కిలోమీటర్లు ప్రయాణం చేసి సతివాడ మీదుగా రామతీర్థానికి చేరుకోవాలి.

తిరుపతి నుంచి వచ్చిన పట్టువస్త్రాలు



ఏటా జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలకు తిరుపతితో పాటు సింహాచలం సింహాద్రి అప్పన దేవాలయం నుంచి పట్టువస్త్రాలు తేవడం ఆనవాయతీగా వస్తోంది. ఇందులో భాగంగానే తిరుపతి నుంచి స్వామి వారి పట్టువస్త్రాలను అర్చకులు ఇటీవల తీసుకువచ్చారు. కల్యాణం రోజున సింహాచలం అప్పన్న స్వామి సన్నిధి నుంచి రామతీర్థానికి పట్టువస్త్రాలు తెస్తారు. వీటిని ఎమ్మెల్యే బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి సమర్పించనున్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా..



కల్యాణాన్ని వీక్షించేందుకు వస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నాం. 18వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపడుతున్నాం. భక్తులకు మంచినీరు, మజ్జిగ, చిన్న పిల్లలకు పాలు, తలంబ్రాల పంపిణీకు ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు, ఉచిత ప్రసాదాల పంపిణీ తదితర సౌకర్యాలను కల్పిస్తున్నాం. దేవదాయశాఖ ఉన్నతాధికారులతో పాటు ప్రజా ప్రతినిధులను కల్యాణానికి ఆహ్వానించాం.

– కిశోర్‌కుమార్, ఈఓ, రామతీర్థం

గట్టి బందోబస్తు...



శ్రీరామనవమి రోజున రామతీర్థంలో గట్టిబందోబస్తును ఏర్పాటు చేస్తున్నాం. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకుంటాం. 150 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తాం. డీఎస్పీ స్థాయి అధికారి, ఏడుగురు ఎస్ఐలు, ముగ్గురు సీఐలు తమ విధులను నిర్వర్తించనున్నారు. సుమారు 20వేల మంది భక్తులు వస్తారని అంచనా వేశాం. కల్యాణం సజావుగా సాగేందుకు భక్తులు సహకరించాలి.

– నారాయణరావు,ఎస్ఐ, నెల్లిమర్ల

పవిత్ర గోటి తలంబ్రాలు సమర్పణ



ఈఓ ప్రసాదరావుకు పవిత్ర గోటి తలంబ్రాలను అందజేస్తున్న భక్తులు

శ్రీరామనవమి సందర్భంగా రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో గురువారం జరగనున్న సీతారాముల కల్యాణానికి తూర్పుగోదావరి జిల్లా, కిర్లంపూడి మండలంలోని జగపతినగరం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు ప్రత్యేకంగా సేద్యం చేసి గోటితో వలిచిన పవిత్ర తలంబ్రాలను ఈఓ కిశోర్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో భజన బృంద ప్రతినిధి పైడిరాజు పాల్గొన్నారు.

అభిజిత్ లగ్నంలో కల్యాణం..



కల్యాణ వేదిక వద్ద ఉదయం 10.30 నుంచి శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవ పూజలు ప్రారంభిస్తాం. సరిగ్గా 12 గంటలకు అభిజిత్ లగ్నంలో స్వామి కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా జరిపించనున్నాం. తిరుమల నుంచి పట్టు వస్త్రాలు రామతీర్థం చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కల్యాణం రోజున సింహాచలం అప్పన్న స్వామి సన్నిధి నుంచి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు రానున్నాయి.

– కిరణ్‌కుమారాచార్యులు, అర్చకులు, రామతీర్థం

వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం

- డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అవనాపు భావన

విజయనగరం ఫోర్ట్: ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు ఆదాయం సమకూరుతుందని, యువత ఆ దిశగా అడుగులు వేయాలని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన పిలుపునిచ్చారు. స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మహాజన సభలో ఆమె మాట్లాడారు. అందరి సహకారంతో డీసీఎంఎస్ లాభాలబాటలో పయనిస్తోందన్నారు. గత ఏడాది రూ.19 కోట్ల టర్నోవర్ సాధిస్తే, ఈ ఏడాది రూ.21 కోట్ల టర్నోవర్ సాధించామని తెలిపారు. డీసీఎంఎస్ అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు చేస్తున్న సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, వ్యవసాయ శాఖ డీడీ అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయమే ఊపిరిగా...



సంకల్పర్యాలీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సామాజిక న్యాయమే ఊపిరిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. విజయవాడలోని స్వరాజ్యమైదానంలో సుమారు రూ.255 కోట్ల వ్యయంతో 125 అడుగుల నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం తలపెట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా అంబేడ్కర్ అందరివాడు సాధన సమితి, ఆంధ్రప్రదేశ్ శాఖ రూపొందించిన కరపత్రాలను కోలగట్ల మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 352 మెట్రిక్ టన్నుల ఉక్కు, 112 మెట్రిక్ టన్నుల ఇత్తడితో విగ్రహం నిర్మిస్తుండడం సంతోషదాయకమన్నారు. సుమారు 18 ఎకరాల్లో చేపడుతున్న అంబేడ్కర్ స్మృతి వనంలో మెమోరియల్ హాల్, మెమోరియల్ లైబ్రరీ, స్టడీ సెంటర్, ల్యాండ్‌స్కేపింగ్ తదితర నిర్మాణాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఏప్రిల్ 13న జైభీమ్‌లతో జిల్లా కేంద్రంలో నిర్వహించే సంకల్ప ర్యాలీని విజయవంతం చేయాలన్యానరు. కార్యక్రమంలో సాధన సమితి ప్రతినిధులు బి.భానుమూర్తి, మల్లన సంతోష్, జి.వీర్రాజు, ఉత్తరాంధ్ర అంబేడ్కర్ రైట్స్ కన్వీనర్ పి.వెంకటరమణ, కార్పొరేటర్లు పి.శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి, డి.సత్యవతి, ఎస్సీ, ఎస్టీ ప్రతినిధులు పి.చంద్రశేఖర్, అప్పారావు, సింహాద్రి పాల్గొన్నారు.

నలుగురు డీబార్

విజయనగరం పూల్‌బాగ్: ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థులకు మంగళవారం జరిగిన కెమిస్ట్రీ–1, కామర్స్–1, సోషియాలజీ–1, ఫైన్ ఆర్ట్స్ మ్యూజిక్ పేపర్–1 పరీక్షకు విజయనగరం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22,024 మంది విద్యార్థులు హాజరుకాగా, 1268 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐఓ ఐదు పరీక్ష కేంద్రాలను, డీఈసీ మూడు కేంద్రాలను తనిఖీ చేశారు. స్క్వాడ్ బృందాలు 42, ఇతర అధికారులు 8 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన నలుగురిని డీబార్ చేసినట్టు ఆర్ఐఓ ఎం.సత్యనారాయణ తెలిపారు.

శివడవలస విద్యార్థిని ప్రతిభ

- వరుసగా నాలుగు సార్లు గోల్డ్‌మెడల్ సాధించిన మెడికో



బంగారుపతకాలు, కుటుంబసభ్యులతో సాయికీర్తన

బొబ్బిలి రూరల్: మండలంలోని శివడవలసకు చెందిన విద్యార్థిని కర్రి సాయికీర్తన విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువులో ప్రతిభ చూపింది. నాలుగేళ్లుగా డిస్టింక్షన్‌లో పాసై నాలుగు బంగారు పతకాలు సాధించింది. విద్యార్థిని తండ్రి కన్నంనాయుడు వైద్యుడు కాగా తల్లి రాణీదేవి గృహిణి. ఆమె ఇద్దరు చెల్లెళ్లు (కవలలు) ఇద్దరూ బీటెక్ చదువుతున్నారు. చదువులో విశేషప్రతిభ సాధించిన సాయికీర్తనను పలువురు అభినందించారు.

ప్రమాదానికి గురై.. పరీక్షకు దూరమై..



పరీక్ష కేంద్రం గేటు ముందు నిరీక్షిస్తున్న విద్యార్థిని

రాజాం సిటీ: ప్రమాదానికి గురై పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వెళ్లిన ఓ విద్యార్థిని అక్కడి చీఫ్ అనుమతించకపోవడంతో చేసేదేమీలేక ఉసూరుమంటూ ఇంటిముఖం పట్టింది. వివరాల్లోకి వెళ్తే.. ఇంటర్ ఫస్టియర్ ఆఖరు పరీక్షకు రేగిడి మండలం సోమరాజుపేట గ్రామానికి చెందిన విద్యార్థిని వస్తున్న ఆటో మంగళవారం ప్రమాదానికి గురైంది. ఆమెకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే అదే ఆటోలో రాజాంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆమెను బాబానగర్‌లోని గాయత్రి కళాశాలలో పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. అప్పటికే ఇచ్చిన గడువు కంటే 25 నిమిషాలు ఆలస్యం కావడంతో చీఫ్ సూపరింటెండెంట్ ఆమెను పరీక్షకేంద్రంలోకి అనుమతించలేదు. ప్రమాదానికి గురయ్యాయనని, ఆస్పత్రికి సంబంధించిన పేపర్లు చూపించి ప్రాథేయపడినా అనుమతించకపోవడంతో చేసేదేమీలేక వెనుదిరిగింది. నిబంధనలకు విరుద్ధంగా తామేమీ చేయలేమని చీఫ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ తెలిపారు.

నేడు రైతు సదస్సు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి వెటర్నరీ కళాశాలలో అసోసియేట్ డీన్ డా.మక్కేన శ్రీను ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు రైతుసదస్సు (కిసాన్‌మేళా) నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసరావు తెలిపారు. సదస్సులో పలువురు శాస్త్రవేత్తలు హాజరై రైతులకు సూచనలు, సలహాలు అందిస్తారన్నారు. రైతు సోదరులందరూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 430 మందికి ఉద్యోగాలు



క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని మహారాజా అటానమస్ కళాశాలలో మంగళవారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 430 మందికి ఉద్యోగాలు లభించాయి. తునిలోని నక్కపల్లి సమీపంలో ఉన్న హెటిరో ఫార్మా కంపెనీ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, ఎమ్మెస్సీ, ఐటీఐ డిప్లమో విద్యార్థులు 598 మంది హాజరయ్యారు. వీరిలో అర్హులైన 430 మంది సంస్థలోని క్యూసీ, క్యూఏ, ప్రొడక్షన్ విభాగాల్లో ఏడాదికి రూ.2.6 లక్షల నుంచి రూ.2.90 లక్షల జీతానికి ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్ మేనేజర్లు రాజు, మణికంఠ, హరితోపాటు కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి కె.రాజుసంతోష్, అధ్యాపకులు డాక్టర్ బి.దిలీప్‌కుమార్, పి.నూకరాజు, రాము, శంకరరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఏర్పాటుకు ఆమోదం

విజయనగరం లీగల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో విజయనగరం జిల్లాలో న్యాయ సేవాధికార సంస్థ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఏర్పాటుకు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆమోదం తెలిపిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి తెలిపారు. కౌన్సిల్‌లో నియమితులైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కేటాయించిన కేసులను మాత్రమే ఉచితంగా వాదించాలని స్పష్టం చేశారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లో మూడు స్థాయిలలో న్యాయవాదుల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నామన్నారు.

- చీఫ్‌లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఏర్పాటుకు 10 ఏళ్ల పాటు క్రిమినల్ కేసులని వాదించే అనుభవం
- డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌కు కనీసం ఏడేళ్ల అనుభవం
- అసిస్టెంట్ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌కు మూడేళ్ల అనుభవం కలిగిన న్యాయవాద అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు.

ఇతర వివరాలకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వెబ్‌సైట్ https://apssa.ap.nic.in, విజయనగరం జిల్లా కోర్టు వెబ్‌సైట్ https://districts.ecourts.gov.in/vizianagaram లలో పూర్తి వివరాలను పొందగలరని తెలిపారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న విశ్వనాథం

పార్వతీపురం: భార్య రాజీకి రావడంలేదని మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం ఎంఆర్ నగరానికి చెందిన బి.విశ్వనాథం భార్య వెంకటలక్ష్మి రెండేళ్ల క్రితం గృహహింస చట్టం కింద భర్తపై కేసు పెట్టింది. కేసులో రాజీకి రావాలని భర్త ఎన్నిసార్లు కోరినప్పటికీ ఆమె ససేమిరా అనడంతో మనస్తాపానికి గురై మంగళవారం సాయంత్రం ఎలకల మందు తాగేశాడు. ఈ విషయాన్ని బంధువులు గమనించి ఆటోలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.

చిత్రహింసలు భరించలేక మహిళ..



చికిత్స పొందుతున్న కనక మహాలక్ష్మి

పార్వతీపురం: పెళ్లి అయిన కొద్ది నెలలకే అత్తింటివారి వేధింపులు, భర్త చిత్ర హింసలను తట్టుకోలేక ఓ గృహిణి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటపై మంగళవారం పార్వతీపురం అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మక్కువ మండలకేంద్రానికి చెందిన ఎస్.కనక మహాలక్ష్మి అత్తింటివారు అదనపు కట్నం తీసుకురావాలన్న వేధింపులు, భర్త శ్రీనివాసరావు మానసికంగా చిత్రవధ చేస్తుండడంతో మనస్తాపానికి గురై పురుగు మందు తాగేసింది. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం మక్కువ ఆస్పత్రికి తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

108 లో ప్రసవం



మోహిని ప్రసవించిన మగబిడ్డను చూపుతున్న ఈఎంటీ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని శాంతినగర్‌కు జె.మోహిని 108 వాహనంలో ప్రసవించింది. మోహిని పురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు సోమవారం అర్ధరాత్రి 108 అంబులెన్సుకు ఫోన్ చేశారు. సమాచారం మేరకు సిబ్బంది చేరుకుని మోహినిని అంబులెన్సులో ఎక్కించి ఆస్పత్రికి తరలించడానికి సిద్ధమవుతున్న తరుణంలో ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో వాహనంలోనే ఈఎంటీ అప్పలనాయుడు, ట్రైనీ ఈఎంటీ కుసుమకుమారిలు ప్రసవం జరిపించగా మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను మెరుగైన చికిత్స కోసం ఘోషా ఆస్పత్రికి తరలించారు.

CHANGE OF NAME

I KADIYALA KAMESWARI W/o late KADIYALA SATYA VENKATA KAMESWARARAO Age 50Years Present Residing at HIG-19/1BS2, Vuda Colony, KAP Layout, Vizianagaram. KADIYALA KAMESWARI (New Name) PULLILA KAMESWARI (old name) Hence after all My Documents and correspondence will be Continue with my New Name KADIYALA KAMESWARI. Iam issuing this declaration way of Affidavite Notary Stating both the names Mentioned as KADIYALA KAMESWARI and PULLILA KAMESWARI are Belongs to same Persons to me.

పాడి రైతుకు వరం..

సంచార వాహనం



సంచార వాహనం వద్ద పశువులకు వైద్యం అందిస్తున్న వైద్యులు

- పశువుల చికిత్సకు కొత్తగా మరో 6 సంచార వాహనాలు
- ఒక్కో వాహనానికీ రూ.30 లక్షల వ్యయం
- గతంలో నియోజకవర్గానికి ఒక్కో వాహనం

బొబ్బిలి: పాడిరైతులకు సహాయకారిగా మెలుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం వారికి మరింతగా అండదండలు అందించేలా నిర్ణయాలు తీసుకుంటోంది. పాడి రైతుల ఆవులు, గేదెలే కాకుండా వ్యవసాయానికి ఉపయుక్తమయ్యే ఎడ్లు తదితర మూగజీవాల వైద్యానికి జిల్లాలో ఉన్న సంచార వాహనాల సంఖ్యను పెంచింది. దీంతో ఆయా రైతులకు మరింత మేలు కలగనుంది. దీనివల్ల ప్రయోజనం పొందే రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ పశు ఆరోగ్య సేవా కేంద్రాలుగా సేవలందిస్తున్న ఈ వాహనాలతో పాడి రైతులకు ఎంతో మేలు కలుగుతుందనడంలో సందేహం లేదు.

ఇప్పటికే ఏడు వాహనాలు

జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాలకూ ఒక్కోటి చొప్పున పశు చికిత్స సంచార వాహనాన్ని కేటాయించిన ప్రభుత్వం అందులో సిబ్బందితో పశువులకు చికిత్సలు, వైద్యం అందజేస్తోంది. ప్రతి నియోజకవర్గంలో ఒక్కో సంచార వాహనం పనిచేస్తోంది.

రెండో విడతలో మరో ఆరు వాహనాలు

గతంలో నియోజకవర్గానికి ఒక్కో వాహనం కేటాయించిన ప్రాంతాల్లో మరో వాహనం చొప్పున పక్కనే ఉన్న పశువైద్య కేంద్రానికి కేటాయిస్తారు.

196కు ఫోన్ చేయగానే..

ఆవులు, గేదెలకు ఆరోగ్య సమస్యలు తలెత్తినపుడు ఆయా పాడి రైతులు ఫోన్ నంబర్ 196కు ఫోన్ చేస్తున్నారు. వారికి కాల్ సెంటర్ నుంచి ఫోన్ చేసి సమస్యపై క్షుణ్ణంగా వివరాలు సేకరిస్తారు. ఆ వెంటనే పశువు దగ్గరకు వాహనం వెళ్లి సేవలందిస్తుంది. ఇందులో అన్ని రకాల సేవలందిస్తారు.



చికిత్స కోసం వాహనం ఎక్కించిన పశువు

కదల లేని పరిస్థితుల్లో హైడ్రాలిక్ పరికరం

పశువులకు ప్రమాదాలు, లేదా ఇతర లేవలేని సేవలు అవసరమైన సమయంలో భారీ ఆకారం ఉన్న పశువులను కూడా సులువుగా లేపి చికిత్స చేసేందుకు హైడ్రాలిక్ పరికరాన్ని వాహనంలో ఏర్పాటు చేశారు. గతంలో ఆ పశువు వద్దకు వచ్చి తాళ్లతో కట్టి లేపే ప్రయత్నాలు చేసేందుకు రైతులు కష్టపడాల్సి వచ్చేది. ఇప్పుడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.నేరుగా పాడి రైతు ఇంటికి వచ్చి పశువును హైడ్రాలిక్ యంత్రపరికరంతో పైకి లేపి అవసరాన్ని బట్టి ఆస్పత్రికి కూడా తీసుకువెళ్తారు. వైద్య చికిత్స పూర్తయ్యాక తిరిగి రైతు ఇంటికే తీసుకువచ్చి పాడి పశువును అప్పగిస్తారు. ఇందుకోసం రైతులు ఏ విధమైన పైకం చెల్లించనక్కర లేదు. పూర్తి ఉచితంగా ఈ సేవలందిస్తారు.

ఈ కేంద్రాల్లో సంచార వైద్యం

గతంలో చీపురుపల్లి, నెల్లిమర్ల, బొబ్బిలి, ఎస్ కోట, గజపతినగరం. విజయనగరం, రాజాంలలో ఈ వాహనాలుండగా ఇప్పుడు కొత్తగా తెర్లాం, భోగాపురం, కొత్తవలస, గుర్ల, సంతకవిటి, గంట్యాడ ప్రాంతాలకు కొత్తగా వాహనాలను మంజూరు చేశారు. ఈ ప్రాంతాల్లో ఉండే వాహనాలు చుట్టుపక్కల ఉన్న అన్ని గ్రామాలకు వెళ్లి పశు వైద్యం అందేలా చర్యలు తీసుకుంటారు.

ఇప్పటివరకూ అందించిన చికిత్సలిలా..

వాహనాల ద్వారా జిల్లాలోని 27 మండలాల్లో ఉన్న 10,082 పశువులకు వైద్యం అందించగా అందులో శస్త్ర చికిత్సలు 45, రక్త పరీక్షలు187, పేడ పరీక్షలు 498, నాశిక పరీక్షలు 39, పాల పరీక్షలు 68, మూత్ర పరీక్షలు10 చేశారు. దీంతో ఆయా పాడి రైతులకు ప్రయోజనం కలిగింది.

పాడి రైతులు వినియోగించుకోవాలి



జిల్లాలోని రైతులంతా వారి పశువులకు అవసరమైన వైద్యం, చికిత్స చేయించుకునేందుకు సంచార వాహనాలను వినియోగించుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకించి రైతుల కోసం పెద్దమొత్తం ఖర్చు చేసి సంచార వాహనాలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మంచి ప్రయోజనకరంగా ఉంది.

– డాక్టర్ వైవీ రమణ, జేడీ, పశుసంవర్ధక శాఖ, విజయనగరం

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు



చీపురుపల్లి రూరల్: బోల్తా పడిన ఆటో



బొబ్బిలి: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు

చీపురుపల్లిరూరల్(గరివిడి)/కొత్తవలస/బొబ్బిలి: విజయనగరం జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పలువురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. ఆయా ప్రమాద సంఘటనలపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఆటో బోల్తా పడి..

గరివిడి మండలంలోని కుమరాం-ఆకులపేట రహదారిలో ఆటో బోల్తా పడి పలువురు మహిళలు గాయాలపాలయ్యారు. గరివిడి మండలంలోని ఎం.దుగ్గివలస గ్రామానికి చెందిన ఎం.హరికృష్ణ ఆటో కొనుగోలు చేసి మంచి ముహూర్తం కోసం అదే గ్రామానికి చెందిన ఐదుగురు మహిళలను ఎక్కించి కొన్ని దేవాలయాలకు తీసుకువెళ్లాడు. అలా దేవాలయాలకు తీసుకువెళ్తున్న క్రమంలో కుమరాం రహదారిలో గల మలుపు వద్ద ఆటో అదుపు తప్పి పంట పొలాల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో కింద మహిళలు ఉండిపోవడంతో స్థానిక యువత గమనించి ఆటోలో నుంచి వారిని బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఆటోలో కూర్చున్న ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలు కాగా మన్నిపూరి సత్యవతి, మన్నిపూరి సావిత్రిలకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలైన వారిద్దరిని 108లో చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి విజయనగరం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

బస్సు ఢీకొని..

బొబ్బిలి పట్టణంలోని ఫ్లెటోవర్ వద్ద పాకి వీధికి చెందిన చలుమూరి రాము బైక్‌పై వెళ్తూ ఫ్లెటోవర్ వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తుండగా ఢీకొనడంతో కాలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని ప్రథమ చికిత్స అనంతరం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన వ్యాన్..

కొత్తవలస-విజయనగరం రోడ్డులో అర్ధాన్నపాలెం గ్రామం సమీపంలో ద్విచక్రవాహనాన్ని వ్యాన్ బలంగా ఢీకొట్టడంతో ద్విచక్రవాహన చోదకుడు గొంప కృష్ణ తీవ్ర గాయాల పాలయ్యాడు. గొంప కృష్ణ ద్విచక్రవాహనంపై కంటకాపల్లి నుంచి స్వగ్రామం గొల్లపేట వస్తుండగా కొత్తవలస నుంచి విజయనగరం వైపు మితిమీరిన వేగంతో వెళ్తున్న వ్యాన్ బలంగా ఢీకొట్టింది. దీంతో కృష్ణ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కొత్తవలసలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తీసుకువెళ్లారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	56,150–00
బంగారం(22కి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

టీబీ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

- విచారణకు ఆదేశించిన రీజనల్ డైరెక్టర్

విజయనగరం ఫోర్ట్: క్షయ నివారణ విభాగంలో పోస్టు భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ భర్తీ చేయడంలో తీవ్ర జాప్యం, సీనియర్ టీబీ సూపర్‌వైజర్ పోస్టుకు లేని విద్యార్హతను అదనంగా చేర్చడం వంటి అంశాలపై సాక్షిలో గత నెల 25వతేదీన 'ఎందుకీ జాప్యం' శీర్షికన ప్రచురితమైన కథనానికి రాష్ట్ర హెల్త్ డైరెక్టర్, రీజినల్ డైరక్టర్ స్పందించారు. ఇప్పటికే కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న అకౌంటెంట్ నాయుడును విధుల నుంచి తొలగించారు. తాజాగా జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.లక్ష్మీప్రసాద్‌పై సస్పెన్షన్ విధిస్తూ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా దీనిపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా విశాఖపట్నం రీజనల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రజనిని నియమించి 15 రోజుల్లోగా నివేదిక అందజేయాలని స్పష్టం చేశారు.

రామేశ్వరి ప్రభుకు బాధ్యతల తొలగింపు

జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, క్షయ నివారణ అధికారిగా ఉన్న డాక్టర్ జె. రామేశ్వరి ప్రభును అ బాధ్యతలనుంచి తొలగిస్తూ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ వి.రామిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యామ్నాయంగా అ బాధ్యతలను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.సూర్యనారాయణకు అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు.

హత్య పథకం బట్టబయలు

- నలుగురు నిందితుల అరెస్ట్



అరెస్టు చేసిన నలుగురు నిందితులతో ఎస్సై సురేంద్రనాయుడు

రామభద్రపురం: పాతకక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిని హతమార్చేందుకు ప్రత్యర్థులు పన్నిన కుట్రను పోలీసులు బట్టబయలు చేశారు. ఇటీవల మండలంలోని బూశాయవలస కోల్డ్ స్టోరేజ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం ఇందులో భాగమేనని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు సీఐ తిరుమలరావు మంగళవారం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. గతేడాది జూలై నెలలో మండలంలోని ఆరికతోటలో కూరాకుల కులానికి చెందిన వారు పాత కక్షలతో ఆ గ్రామంలో నడిరోడ్డుపై కత్తితో నరికి వర్రి చిన్నోడును హత్యచేశారు. హత్యకు పాల్పడిన నిందితులు కొద్ది రోజుల క్రితం బెయిల్‌పై వచ్చారు. హతుడి కుటుంబీకులు ప్రత్యర్థుల్లో ఎవరో ఒకరిని చంపాలని కక్షతో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14వ తేదీన హత్యానేరం కింద ఎ4గా ఉన్న కర్రి శంకరరావు మక్కువ మండలం కాశీపట్నం వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో అదే మండలంలోని బూశాయవలస కోల్డ్‌స్టోరేజీ వద్ద వ్యాన్‌తో ఢీకొట్టారు. దీంతో శంకరరాకు స్వల్ప గాయాలయ్యాయి. వ్యాన్ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన శంకరరావును ప్రథమ చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించి,వ్యాన్ స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తప్పుడు చిరునామాతో వ్యాన్ కొనుగోలు

వ్యాన్ డ్రైవర్ గోపాల్ దొరకకపోవడంతో అనుమానం వచ్చి వ్యాన్ గురించి విచారణ చేపట్టి ఆరికతోట గ్రామానికి చెందిన వర్రి శివుడు, మామిడి రాము, వర్రి గౌరీస్‌లు సాలూరు మండలంలోని లక్కుడువలస గ్రామం పేరు చెప్పి తప్పుడు అడ్రస్‌తో వ్యాన్ కొనుగోలు చేసినట్లు గుర్తించారు. దీంతో ఆ ముగ్గురిని అరెస్ట్ చేసి విచారణ చేయగా ప్రణాళిక ప్రకారం వ్యాన్‌తో శంకరరావును ఢీకొట్టి హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ఆలోచన చేశామని, అందుకే వ్యాన్ కొనుగోలు చేసి డ్రైవర్‌ను నియమించామని అంగీకరించారు. అలాగే పోలీసులు కూడా ఫోన్‌కాల్స్ ఆధారంగా నిందితులు నలుగురిని గుర్తించి అరెస్టు చేసి సాలూరు కోర్టులో హాజరపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని డార్మిటరీలో గల లాకర్‌లో దాచుకున్న నగదును దొంగిలించిన కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మంగళవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన ప్లైవుడ్ వ్యాపారి కె.చిట్టిబాబు ఈ నెల 3న వ్యాపారం నిమిత్తం జిల్లాకు వచ్చి, ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న డార్మిటరీలో క్యాష్ బ్యాగ్ పెట్టుకున్నాడు. ఈ నెల 8న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు లాకర్‌లో వ్యాపారి పెట్టిన రూ.95వేలు నగదుతో కూడిన బ్యాగ్‌ను దొంగలించారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి పోలీసులు విచారణ ప్రారంభించారు. మంగళవారం ఉదయం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు అందిన సమాచారంతో పట్టణానికి చెందిన బిపి.కుమార్, పెందుర్తికి చెందిన జి.శ్రీకాంత్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.90 వేల నగదు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్సైలు అశోక్‌కుమార్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్సై విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి..

ట్రాఫిక్ ఎస్సై హరిబాబునాయుడు విధులకు ఆటంకం కలిగించి, దౌర్జన్యం చేసిన లంకాపట్నానికి చెందిన సోము శంకరరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. శంకరరావు స్నేహితుడు రమేష్ మద్యం మత్తులో ఆటో నడుపుతూ డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. ఆ సమయంలో విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ ఎస్సై బి.హరిబాబునాయుడిని నిందితుడు సోమశంకర్ అడ్డగించి దౌర్జన్యం చేసి, చంపుతానని బెదిరించాడు. ఈ మేరకు ఎస్సై ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి శంకరరావును అరెస్టు చేసినట్లు సీఐ ప్రకటనలో వివరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని కలాసీ మృతి



కలాసీ స్వామి నాయుడు (ఫైల్)

కొత్తవలస: అరకు–విశాఖ అంతర్ రాష్ట్ర రహదారిలో అద్దూరివానిపాలెం గ్రామం సమీపంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మండలంలోని వీరభద్రపురం గ్రామానికి చెందిన కలాసీ గండ్రేడ స్వామినాయుడు (45)అక్కడికి అక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. అద్దూరివానిపాలెం గ్రామం సమీపంలో గల గొడౌన్‌కు లారీలో వచ్చిన సిమెంట్‌ను దించేందుకు కలాసీలు వచ్చారు. లారీని రోడ్డు పక్కన ఆపి గొడౌన్ వద్ద సిమెంట్‌ను దించేందుకు ఏర్పాట్లు చేసుకునే క్రమంలో కలాసీ స్వామినాయుడితో పాటు లారీ డ్రైవర్ రోడ్డు పక్కన నిలబడ్డారు,. అంతలో విశాఖపట్నం నుంచి ఎస్.కోట వెళ్తున్న గుర్తు తెలియని వాహనం మితిమీరిన వేగంతో వచ్చి కలాసీ స్వామినాయుడు, లారీ డ్రైవర్‌ను బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో కలాసీ స్వామినాయుడు అక్కడికక్కడే మృతి చెందగా లారీడ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు 108 వాహనంలో తోటి కలాసీలు తరలించారు. మృతుడికి భార్య, ఒక పాప ఉన్నారు.

అగ్ని ప్రమాదానికి గురై వృద్ధురాలు..

పాలకొండ రూరల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో నివాసముంటున్న చౌదరి సత్యవతి(62) తన ఇంటి సమీపంలో గల గడ్డివాముకు నిప్పు అంటుకోవటంతో ప్రమాదవశాస్తు అందులో చిక్కుని తీవ్రంగా గాయపడింది, దీంతో బాధితురాలిని శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది.

చికిత్స పొందుతూ వ్యక్తి..

బొండపల్లి: అజాగ్రత్తగా కారు నడుపుతూ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని బలంగా ఢీకోనడంతో బొండపల్లి మండలంలోని ముద్దూరు జంక్షన్ వద్ద ఓ వ్యక్తి మృతి చెందాడు, వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నంలోని ఆరిలోవకు చెందిన చవన్ శ్రీను(34) ద్విచక్ర వాహనంపై సోమవారం సాయంత్రం విజయనగరం నుంచి గజపతినగరం వస్తుండగా, గజపతినగరం నుంచి విజయనగరం వెళుతున్న కారు ముద్దూరు జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహన చోదకుడిని ఢీకొట్టింది. దీంతో చవన్ శ్రీను తలకు తీవ్ర గాయాలవడంతో విజయనగరంలోని కేంద్రాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

బైక్.. మొబైల్‌ఫోన్ అపహరణ

మెరకముడిదాం: మండలంలోని శ్యామాయవలస గ్రామంలో సోమవారం రాత్రి ఒకబైక్, రెండు సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరివిడి మండలం చుక్కవలస గ్రామానికి చెందిన మీసాల శివాజీ తన అత్తవారిల్లు దాసరిబుజ్జి ఇంటికి సోమవారం సాయంత్రం వచ్చాడు. రాత్రి అత్తవారింటిముందు తన బైక్ పెట్టి పడుకున్నాడు. అయితే అర్ధరాత్రి రెండుగంటల సమయంలో ఇంటిముందు ఉన్న బైక్, ఇంట్లో ఉన్న రెండు మొబైల్‌ఫోన్లు గుర్తుతెలియని దుండగులు అపహరించుకుపోయారు. మంగళవారం ఉదయం ఇంటిముందు బైక్‌లేకపోవడంతో ఆశ్చర్యానికి గురైన శివాజీ..తన మొబైల్ కూడా అపహరణకు గురైనట్లు తెలుసుకుని వెంటనే బుదరాయవలస పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయం, బాలాజీ నగర్, సిరిపురం జంక్షన్, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : శ్రీ టి.అప్పయ్య (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.+91 80999 28505, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in , ఆస్తి తనిఖీ కొరకు : 82494 83472

ఇ.-వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన చరాస్తి అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు స్వాధీనం చేసుకున్నారు. [illegible] (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు " అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై [illegible]

ఋణగ్రహీతలు/ హామీదారులు : మెస్సర్స్ [illegible] ఫుడ్ ఇండస్ట్రీస్, ప్లాటు నెం.56, ఎపిఐఐసి ఇండస్ట్రియల్ గ్రోత్ సెంటర్, బొబ్బిలి, విజయనగరం జిల్లా-535558. 2) శ్రీ జోసెఫ్ [illegible] తండ్రి: [illegible] డి.నెం.1-8-80/201, [illegible] పబ్లిక్ స్కూల్ దగ్గర, సికింద్రాబాద్-500007. డిమాండ్ నోటీసు తేది: 30-11-2019

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం : తేది.30-11-2019 నాటికి రూ.2,00,87,084/- + వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

షెడ్యూల్ ఆస్తి వివరములు (మిషనరీ) : (ఆస్తి ఐడీ :SBINKNR28042023)

విజయనగరం జిల్లా-535558, బొబ్బిలి, ఎపిఐఐసి ఇండస్ట్రియల్ గ్రోత్ సెంటర్, ప్లాటు నెం.56 నందు గల 1) "VEC" Make M-300 Fully Automatic Moulding Line with servo, 2 KL Capacity MS Body with SS Lining jacketed Chocolate Melting Tank -1 No. 200 Litres Capacity MS Body with SS Lining jacketed Chocolate Melting Tanks-2Nos, Cooling Compressor, Nut Dispenser, Nozzle Plate, Extra set of Moulds 400 Nos and Std Accessories. 2) Rotary Rack Oven -V150 Model and Drying Oven. 3) SS Chocolate Agitator (Planetary Mixer) with Motor & Gear box of P100L Model. 4) Chocolate Cream Planetary Mixer with Motor. 5) Sugar Grinder, 6) Batter Mixer, 7) "Domino" make Coding Machine with belt Conveyor and Motor. 8) Packing Machine with belt Conveyor, 9) Love Ball Machine (Old). 10) Office Furniture & Other Items. i) SS Shink Tank-1No. ii)100 litres capacity SS Tank-1 No, iii) Executive Office Tables-2Nos, iv) Iron Office File Rack-1 No, v) MS damaged Almara-1 No, vi) Wooden Damaged Almara-1 No, vii) Office Executive Chairs-3 Nos. viii) Iron table with plywood top tables-3. ix) SS Tables of 2' x 3'-1 No. x) SS Table of size 2' x 6'-1 No. xi) Elec. Boards and Starters-6 Nos.

రిజర్వు ధర : రూ.62,25,000/- ధరావత్తు : రూ.6,22,500/- బిడ్ పెంపుదల : రూ.20,000/-

ఇ-వేలం తేదీ : 27-04-2023 సమయం : ఉ॥ 11.00 గంల నుండి మ॥ 01.00 గంల వరకు

ఆస్తి తనిఖీ తేదీ మరియు సమయం: తేది:29-03-2023 నుండి 26-04-2023 వరకు ఉ॥10.00 గంల నుండి సా॥ 04.00 గంల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) మిషనరీ ఖచ్చితంగా "ఎలా ఉన్నది అలా ప్రాతిపదికన మరియు అక్కడ ఏది ఉంటే అది ప్రాతిపదికన" వేలం వేయబడును.
2) [illegible]
3) [illegible] www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices [illegible] https://www.mstcecommerce.com/auctionhome/ibapi, టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 033-22901004ను సంప్రదించండి.
4) [illegible]

గమనిక : [illegible] MSTC [illegible] (Pre-Bid EMD) [illegible]

తేది: 28-03-2023, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి క్లాసిఫైడ్స్

ONE SITTING

ONE SITTING : 10th, 12th, B.A.,B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA., BCA., MBA., MCA., Nursing, Pharmacy, Dip invet, B.Tech from Recog. University in INDIA (For Discontinued) Exam in April. Cont : 73383 76874 [R-963]

COACHING CENTER

Eamcet, I-Cet & For All Competitive Exams. New Batches on 01-04-2023 @ 9am. SURYA ACADEMY, GURAJADA Road, Kota Jn.,Vizianagaram. Ph : 99490 03295 [V. 6104]

PLOT FOR SALE

600 గజాల తూర్పుఫేస్ స్థలం, బాలాజీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ వెనుక, విజయనగరం మున్సిపాలిటి పరిధిలో అమ్మకమునకు కలదు. గజం: రూ.12,000/- మాత్రమే. ✆ 8500099390 [S-1154265]

BUSINESS

మేము మీ వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నాము. అలాగే ఏజెంట్లను కూడా ఆహ్వానిస్తున్నాము. ఫోన్: 9092692403 [IA-157]

SERVICES

అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత, టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 8699691739. [T-1793]

వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టెక్ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 94630 26237. [T-1800]

ఫైనాన్స్ ఇవ్వబడును.

వ్యక్తిగత, వ్యవసాయ భూములకు, పర్సనల్ రైతులకు, ఉద్యోగులకు, వ్యాపారస్తులకు, ఇండస్ట్రీలకు, ఎడ్యుకేషన్ లోన్స్ అతి తక్కువ వడ్డీతో ఫైనాన్స్ ఇవ్వబడును. సంప్ర: 79974 41253 [P- 1226644]

WANTED

విజయవాడలో ప్రముఖ హోంకేర్ ఆఫీస్‌కి వృద్ధులను, బెడ్‌పేషంట్ లను వారి ఇంటి వద్దె చూసుకొ నుటకు కేర్‌టేకర్స్ M/F కావలెను. జీతం 15-20K వసతి+భోజనంలి 94942 25282, 72070 72559 [B-970]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795276]

URGENT REQUIREMENT AT GUDUR for Manufacturing Company. Drivers-05, Fitters-12, Welder-12 and Business Development Associate-10 (Any Graduate). Please Mail us at : job.gdrp@gmail.com [N-1226002]

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9959617233, 6305641071 [M-1190657]

ప్రముఖ బ్యాంకుల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి ఫిమేల్ స్టాఫ్ అ.కా.ను. జీ.15K to 34K ఇంట్రెస్ట్ ఉన్నవారు డిటెయిల్స్ వాట్సాప్ చేయండి. ఫోన్ : 6281159171 [HA-28700]

VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp Dr, Q: 5th- డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూ ఫ్రీ, Hyd, Ph: 7995365999 [HA-1151]

Work From Home Telicaller Qualification-10th 12th Age 25 to 45 Male & Female MOB-9654255940 [HA-10761]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.